
సాక్షి తిరుపతి

ఆదివారం : 16 : ఏప్రిల్ : 2023



శ్రీవారి సేవలో వీవీఎస్ లక్ష్మణ్

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం ఇండియన్ మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.



కాలుష్యరహిత బండి..

తిరుమల : తిరుమలలో విద్యుత్ బస్సులకు విశేష ఆదరణ లభిస్తోంది. ఇటీవల ధర్మరథం పేరుతో ఏర్పాటు చేసిన విద్యుత్ బస్సును ఎక్కేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	24
చిత్తూరు	40	23
తిరుమల	36	19
గూడూరు	42	26
నగరి	41	24



	ఇఫ్తార్ ఆదివారం(సా)	సహర్ సోమవారం(ఉ)
తిరుపతి	6.29	4.39
చిత్తూరు	6.31	4.37
పుంగనూరు	6.32	4.41

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పది పరీక్షకు 270 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జిల్లాలోని 152 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు సోషియల్ సబ్జెక్టులో పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 26,958 మంది హాజరవ్వాల్సి ఉండగా, వారిలో 270 మంది గైర్హాజరైనట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. ఈ పరీక్షతో ప్రధాన పరీక్షలు ముగిశాయని, 17వ తేదీ సోమవారం ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు కాంపోజిట్ కోర్సు–2/ఓఎస్ఎస్‌సీ పేపర్–1, అలాగే 18వ తేదీ మంగళవారం ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఓఎస్ఎస్‌సీ పేపర్–2/ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు సబ్జెక్టులో పరీక్ష జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.


ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



గురుదక్షిణామూర్తి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి, ఐఏఎస్ అధికారి విశాల్ వేర్వేరుగా దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పాకాల కోర్టుని సందర్శించిన న్యాయమూర్తి



న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు

పాకాల: స్థానిక కోర్టుని చిత్తూరు జిల్లా 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక కోర్టు న్యాయమూర్తి బీవీ.సులోచనారాణి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప నాయుడు, సెక్రటరీ గౌరీశంకర్‌రాజు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం కోర్టులో పెండింగ్ కేసుల వివరాలను జిల్లా న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట న్యాయవాదులు గురుస్వామినాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, సలీం, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మే 31కి మినీగోకులం షెడ్లు

తిరుపతి అర్బన్: మినీగోకులం షెడ్లు మే 31వ తేదీ నాటికి పూర్తికానున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. జిల్లాలో 998 మంది పాడి రైతులకు మినీ గోకులం షెడ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రెండు నుంచి నాలుగు పశువులు ఉన్న పాడి రైతుకు రూ.1.5 లక్షలు, నాలుగు నుంచి ఆరు పశువులున్న వారికి రూ.1.8 లక్షలు అందజేస్తామన్నారు. అందులో రూ.10శాతం పాడి రైతు చెల్లిస్తే సరిపోతుందని, మిగిలిన 90 శాతం రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు.

నిరీక్షణకు తెరపడింది... కల నెరవేరింది



ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేయాలని తపన పడ్డారు.. పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలని తహతహలాడారు.. వ్యయప్రయాసలకోర్చి టీచర్ ట్రెనింగ్ పూర్తి చేశారు. కష్టపడి చదివి 1998లో డీఎస్సీ పరీక్షలు రాశారు. అయితే అప్పటి టీడీపీ సర్కారు వ్యవహారశైలితో వందలాది మంది అభ్యర్థుల చేతికొచ్చిన ఉద్యోగం కోర్టు వివాదాల్లో చిక్కుకుంది.. ఇక అప్పటి నుంచి ఉద్యోగార్థుల భవిష్యత్ అంధకారబంధురమైంది.. ఈ క్రమంలో ప్రజాసంకల్పయాత్ర నాడు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డీఎస్సీ అభ్యర్థుల పాతికేళ్ల నిరీక్షణకు తెరదించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 533 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ఏళ్ల తరబడి ఆశనిరాశ నడుమ ఊగిసలాడుతున్న బతుకుల్లో వెలుగులు నింపారు.

- డీఎస్సీ–1998 అభ్యర్థులకు నియామక పత్రాలు
- పాతికేళ్ల అనంతరం పోస్టింగులు
- ఉద్యోగార్థుల్లో హర్షాతిరేకాలు
- వెంటనే విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు



ఉపాధ్యాయ ఉద్యోగ నియామక ఉత్తర్వులతో 1998 డీఎస్సీ అభ్యర్థులు

నగరి : ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం 1998 డీఎస్సీ పరీక్షలు రాసి అర్హత పొందిన వారికి ప్రభుత్వం తీపి కబురు అందించింది. దశాబ్దాల ఎదురుచూపులకు తెరదించింది. జీవితంలో అసలు ప్రభుత్వ టీచర్లుగా ఎంపికవుతామా అనే డోలాయమాన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న అభ్యర్థుల కల సాకారం చేసింది. దీనిపై డీఎస్సీ–1998 అభ్యర్థుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. పాతికేళ్లగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన క్షణం వచ్చేసరికి పలువురు భావోద్వేగానికి గురవుతున్నారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పిదాల కారణంగా తాము ఇన్నేళ్లపాటు ఉద్యోగానికి దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. నియమాకపత్రాలు అందుకున్న పలువురు టీచర్లు తమకు కేటాయించిన పాఠశాలల్లో బాధ్యతలు చేపడుతున్నారు. పిల్లలకు పాఠాలు బోధిస్తూ మురిసిపోతున్నారు. జగనన్న రూపంలో దేవుడు కరుణించాడని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని సంతోషంగా చెబుతున్నారు.

533 మందికి నియామకపత్రాలు



చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 533 మంది డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశారు. 25 ఏళ్ల తర్వాత ఉద్యోగ నియామకపత్రాలు పొందిన వారందరూ సంతోషంగా విధుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. నియామకపత్రాలు స్వీకరించిన రోజు నుంచి 15 రోజుల్లోపు సంబంధిత మండల విద్యాశాఖాధికారి వద్ద విధుల్లో చేరాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. ఇప్పటికే పలువురు బాధ్యతలు చేపట్టగా, మరికొంత మంది విధుల్లో చేరేందుకు అవసరమైన ధ్రువీకరణపత్రాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 66 మండలాల్లో 533 మందికి పోస్టింగులు ఇచ్చినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

జగనన్నకు మాత్రమే అర్థమైంది



కోర్టు వివాదాలతో పాతికేళ్లగా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం పోరాడుతూనే ఉన్నాం. అప్పటి నుంచి పాలకులకు విన్నవించుకుంటూనే ఉన్నాం. బతుకుదెరువుకోసం ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ, మా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. మా కష్టం జగనన్నకు మాత్రమే అర్థమైంది. నేడు ఆయన ఇచ్చిన జీఓ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపింది. ఇన్నేళ్ల తర్వాత ఉపాధ్యాయుడిగా పోస్టింగ్ వచ్చింది. వెంటనే బాధ్యతలు చేపట్టా.

– ఎం. భాస్కర్, ఉపాధ్యాయుడు, పాతారూరు ప్రాథమిక పాఠశాల, విజయపురం మండలం

జీవితాంతం రుణపడి ఉంటా



విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నదే నా ఆశయం. అదే 1998లో డీఎస్సీ రాసేలా చేసింది. అయితే కోర్టు వివాదాల కారణంగా నా ఆశ నిరాశగా మారింది. మా కష్టాలు అప్పటి పాలకులు పట్టించుకోలేదు. స్టూడియో నడుపుతూ జీవనం సాగిస్తున్నా. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన ఉత్తర్వులు మా కలలను నెరవేర్చాయి. పాతికేళ్లగా పడిన శ్రమను మర్చిపోయేలా చేశాయి. ప్రస్తుతం టీచర్‌గా పోస్టింగ్ అందుకున్నా. వెంటనే విధుల్లో చేరి పిల్లలకు పాఠ్యాంశాలు బోధిస్తున్నా. ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా.

– ప్రకాష్, ఉపాధ్యాయుడు, కీళపట్టు బీసీకాలనీ పాఠశాల, నగరి

మాటల్లో చెప్పలేని ఆనందం



సుదీర్ఘ కాలంగా నిరీక్షిస్తున్న ఉద్యోగం వచ్చిందనే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తున్నారు. ఇప్పటికే నాడు–నేడు పనులతో బడులను అత్యున్నతంగా తీర్చిదిద్దారు. గతంలో ఎవరూ ఈ స్థాయిలో విద్యారంగం అభివృద్ధికి కృషి చేయలేదు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులైన మా అందరికీ ఉద్యోగాలు అందించారు. నా కల ఇన్నేళ్లకు నిజమవుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు టీచర్‌గా బాధ్యతలు స్వీకరించా. ఈ క్షణంలో నా అనుభూతి వర్ణనాతీతం.

– నాగరాజు, ఉపాధ్యాయుడు, బీజీ కండ్రిగ ప్రాథమిక పాఠశాల, నింద్ర మండలం

17, 18 తేదీల్లో సమావేశం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈనెల 17, 18 తేదీల్లో దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం జరగనుంది. సమావేశంలో గత ఏడాది (2022–23)లో నిర్వహించిన పరిశోధన, విస్తరణ ఫలితాలను విశ్లేషించడం, వచ్చే 2023–24లో చేపట్టాల్సిన పరిశోధన, విస్తరణ కార్యక్రమాలపై చర్చించనున్నారు. సమావేశానికి దక్షిణ మండలంలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, ఆచార్య ఎన్జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా డైరెక్టర్, విస్తరణ డైరెక్టర్, దక్షిణ మండల సహ పరిశోధనా డైరెక్టర్, శాస్త్రవేత్తలు, రైతులు హాజరుకానున్నారు.

తిరుపతి వైపు..ఐటీ చూపు

ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగర పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు. మొన్న విశాఖలో జరిగిన గ్లోబెల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పారిశ్రామిక వేత్తలు తిరుపతి జిల్లాలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్నారు. తాజాగా శనివారం రేణిగుంట విమానాశ్రయం వద్ద ఉన్న అపెటా భవనంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలు కంపెనీల సీఈఓలు హాజరయ్యారు. తిరుపతిలో ఐటీ సంస్థలు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి ఎంఓయూ కుదుర్చుకున్నారు.

- రూ.500 కోట్లతో వివిధ కంపెనీల ఒప్పందం
- భూములు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధం
- తిరుపతిలో 15 ఐటీ కంపెనీల సీఈఓల సమావేశం
- వేలాది మంది స్థానికులకు ఉపాధి కల్పనే లక్ష్యం
- ఫలిస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి కృషి

సాక్షి, తిరుపతి: తిరుపతి– కడప ఈఎంసీ క్లస్టర్ల పరిధిలో పలు పరిశ్రమల స్థాపనకు పెట్టుబడీదారులు ముందుకొస్తున్నారు. రవాణా, రైలు మార్గాలు.. అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులో ఉండడంతో పెట్టుబడీదారుల చూపు తిరుపతి వైపు పడింది. స్థానికంగా కేంద్ర విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు తదితరాలు ఉండడంతో పలువురు ఆధ్యాత్మిక నగరాన్ని ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సింగిల్ డెస్క్ విధానం పారిశ్రామిక వేత్తలకు కలిసి వస్తోంది. పరిశ్రమల స్థాపనకు అన్ని అనుమతులు త్వరితగతిన అందించడంతో పలువురు ఇన్వెస్టర్లు మొగ్గుచూపుతున్నారు. ఇటీవల విశాఖ పట్టణంలో నిర్వహించిన గ్లోబెల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో తిరుపతి, కడప ఈఎంసీ క్లస్టర్లో రూ.10 వేల కోట్లకుపైగా పెట్టుబడులతో వివిధ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చర్ పరిశ్రమలు ఏర్పాటు



ఐటీ సంస్థ ప్రతినిధులతో తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి

అందుబాటులో మానవ వనరులు

తిరుపతి ఆధ్యాత్మిక నగరం మాత్రమే కాకుండా క్రీస్తు పూర్వమే విద్యాలయాలకు నిలయం. నేడు తిరుపతి ఐఐటీ, ఐజర్, ఎస్వీ యూనివర్సిటీ, పద్మావతి యూనివర్సిటీలాంటి ప్రఖ్యాత విద్యాసంస్థలతో విరాజిల్లుతోంది. ఆయా సంస్థల నుంచి ఏటా వేల సంఖ్యలో విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారు. తిరుపతిలో ఐటీ కంపెనీలు స్థాపించి పెట్టుబడులు పెట్టడం వల్ల మొదటగా ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరులు అందుబాటులో ఉంటాయి. మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి సహకారంతో తిరుపతి జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తోంది. పెట్టుబడులు పెట్టే వారికి అన్ని విధాలుగా ప్రభుత్వం సహకరిస్తుంది.

– మద్దెల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

చేసేందుకు ఎంఓయూలు కుదుర్చుకున్నారు. వీటి ద్వారా 29వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఐటీ కంపెనీల రాక కోసం..

తిరుపతిలో ఐటీ కంపెనీలు స్థాపించేందుకు పెట్టుబడీదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ గురుమూర్తి రేణిగుంట విమానాశ్రయం వద్ద శనివారం ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యూటీఐటీసీ) కార్యాలయం ప్రారంభించారు. అనంతరం ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి వారి ఆధ్వర్యంలో ఐటీ, నాన్ ఐటీ రంగాలకు చెందిన 15 కంపెనీల సీఈఓలతో సమావేశమయ్యారు. వివిధ దేశాల్లో ఉన్న ఐటీ, నాన్ ఐటీ కంపెనీలను సమన్వయం చేసి ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేలా డబ్ల్యూటీఐటీసీ మధ్యవర్తిత్వం వహిస్తుంది. ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి సంపూర్ణ సహకారం అందించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం అని సీఈఓ సందీప్ మత్కల స్పష్టం చేశారు.

పెట్టుబడుల ప్రవాహం

సూట్స్ కేర్‌ని రూ.300 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు సీఈఓ డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి ప్రకటించారు. అందుకు సంబంధించి ఎంఓయూ కుదుర్చుకున్నారు. దీని ద్వారా 2వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. డిజితాన్ చైర్మన్ సందీప్‌కుమార్ మత్కల్ రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఎంఓయూ చేసుకున్నారు. సైమ్యాక్స్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ ఎం.గౌరీశంకర్ రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించారు. ఇంకా.. ఎస్ఆర్ఆర్‌క్లౌడ్ ఎక్స్‌పర్ట్స్ గురూ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.10 కోట్లు, సైబర్ కోంబాట్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రై.లి రూ.10 కోట్లు, వేల్ ఐటీ సొల్యూషన్స్ రూ.10 కోట్లు, ఫ్యూజెనిక్ పవర్ సొల్యూషన్, ఐడియావటర్ సొల్యూషన్స్ ప్రై.లి రూ.10 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయా కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. దీంతో పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

• ఆత్మీయ కానుక



పంపిణీకి సిద్ధంగా రంజాన్ కానుకలు

చంద్రగిరి నియోజకవర్గంలోని 16 వేల ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రంజాన్ కానుక పంపిణీ చేశారు. ఇందులో భాగంగా శనివారం ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

– చంద్రగిరి



ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

కాలినడకన తిరుమలకు కర్ణాటక సీఎస్

చంద్రగిరి: కర్ణాటక రాష్ట్ర చీఫ్ సెక్రటరీ వందితశర్మ కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారి మెట్టు మార్గం గుండా కాలినడకన శనివారం తిరుమలకు వెళ్లారు. శ్రీవారి మెట్టు వద్దకు చేరుకున్న ఆమెకు చంద్రగిరి తహసీల్దార్ శిరీష పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం శ్రీవారిమెట్టు సమీపంలోని ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు కాలినడకన వెళ్లారు. ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.


శ్రీవారిమెట్టు మార్గం గుండా తిరుమలకు వెళ్తున్న కర్ణాటక సీఎస్

గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే భూమన పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: తిరుపతి గంగమ్మ జాతరకు రాష్ట్ర పండుగ గుర్తింపు లభించడంతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి శనివారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని అమ్మవారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య పాల్గొన్నారు.

శరవేగంగా పనులు : మే నెలలో అత్యంత వైభవంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర జరుగనున్న నేపథ్యంలో ఆలయంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాలలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.

కాలుష్యరహిత బండి..ఎక్కేద్దాం పదండి




టీటీడీ కాలుష్య నియంత్రణకు పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే ప్లాస్టిక్ నివారణకు అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గాజు సీసాల్లో నీళ్లు, గుడ్డ సంచులు భక్తులకు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు వాయు కాలుష్యంపైనా దృష్టి సారించింది. ఇందులో భాగంగా విద్యుత్ బస్సులను తీసుకొచ్చింది. ఇటీవల ఏర్పాటు చేసిన విద్యుత్ ధర్మరథం తిరుమాడ వీధుల్లో తిరుగుతూ ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తోంది. దీనికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. - తిరుమల



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,340
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,568
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,300
రిటైల్ వెండి గ్రాము	రూ.79.30

శ్రీవారిమెట్టు వద్ద అడవికి నిప్పు


అంకాలమ్మ లైను వద్ద ఎగసి పడుతున్న మంటలు

చంద్రగిరి: శేషాచల అడవుల్లో గుర్తుతెలియని వ్యక్తులు అడవులకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసిపడుతున్నాయి. శేషాచల అడవుల్లోని పులిబోను, అంకాలమ్మ లైను, కరివేపాకు కోన, సచ్చినోడిబండ, రాగిమానుగుంట తదితర ప్రాంతాలలో గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పుపెట్టారు. శుక్రవారం రాత్రి నుంచి పొగలు రావడం గమనించిన అటవీశాఖ అధికారులు, భాకరాపేట ఎఫ్ఆర్ఓ దత్తాత్రేయ తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. రంగంపేటకు చెందిన అటవీశాఖ అధికారులు అంకాలమ్మ లైను, కరివేపాకుకోన, పులిబోను ప్రాంతాలలో మంటలను అదుపులోకి తేగలిగారు. శ్రీవారిమెట్టు సమీపంలోని సచ్చినోడుబండ, రాగిమానుకుంట ప్రాంతాలలో మంటలు ఎగిసిపడుతుండడంతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆరు బృందాలుగా విడిపోయి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అడవికి నిప్పు పెట్టడం వల్ల అరుదైన వన్యప్రాణులు, వృక్ష సంపద నాశనమవుతోందని ఎఫ్ఆర్ఓ దత్తాత్రేయ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రానికి మంటలు కాస్త అదుపులోకి వచ్చాయని, తమ సిబ్బంది నిరంతరాయంగా మంటలను అదుపులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

అరణియార్ పర్యాటకానికి పూర్వ వైభవం

- రూ.1.82 కోట్ల పనులకు భూమిపూజ
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడి

పిచ్చాటూరు: అరణియార్ పర్యాటకానికి పూర్వ వైభవం తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. తుడా మంజూరు చేసిన రూ.1.82 కోట్ల పర్యాటక అభివృద్ధి పనులకు తుడా ఎస్ఈ, ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తన చిన్నతనంలో అరణియార్ ప్రాజెక్టు ఒక టూరిజమ్ స్పాట్‌గా ఉండేదన్నారు. పలు సినిమాల షూటింగ్, టీవీ సీరియళ్ల చిత్రీకరణకు ఈ ప్రాంతం వేదికగా నిలిచిందన్నారు. చివరిగా 'నాగమ్మ' టీవీ సీరియల్ 90 శాతం ఈ ప్రాంతంలోనే చిత్రీకరణ జరిగినట్లు వెల్లడించారు. ఇంతగొప్ప ప్రాంతానికి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలనే లక్ష్యంతో ఇరిగేషన్ ఈఈ సహకారంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పంపగా ఆయన వెంటనే అంగీకరించి రూ.1.82 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

వ్యూ టవర్, బోటింగ్, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు

మంజూరైన రూ.1.82 కోట్ల నిధులతో వ్యూటవర్, బోటింగ్ జట్టీ, 4 బోట్లు, చిన్నపిల్లల ఉద్యానవనం వంటి పనులు చేపట్టనున్నట్లు ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ వెల్లడించారు. ఈ పనులను ఏడాదిలో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. పనులు పూర్తయితే చెన్నై-తిరుపతి మధ్యలో గొప్ప టూరిజం స్పాట్ ఆవిష్కృతమవుతుందన్నారు. తుడా ఎస్ఈ వరదారెడ్డి, ఇరిగేషన్ డీఈఈ రత్నారెడ్డి, ఎంపీపీ హేచ్‌రేఖ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కేటీ హరిశ్చంద్రారెడ్డి(పిచ్చాటూరు), అపరంజిరాజు (నాగలాపురం), గవర్లక్రిష్ణయ్య(కేవీబీపురం), విద్యానాథరెడ్డి (బి.ఎన్ కండ్రిగ), వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి, పల్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, వరదయ్యపాళెం జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం


సభకు హాజరైన ఆయకట్టు రైతులు

శ్రీవారి సేవలో ప్రముఖులు


తిరుమలలో డెప్యూటీ సీఎం నారాయణస్వామి, కోలార్ ఎంపీ మునిస్వామి, సినీ నటుడు అశ్విన్ బాబు


తిరుపతి మాజీ కమిషనర్

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కోలార్ ఎంపీ మునిస్వామి, సినీ నటుడు అశ్విన్బాబు, తిరుపతి నగరపాలక మాజీ కమిషనర్ అనుపమ అంజలి, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.